# ధాన్యమాలిని

"ఎవరది? ఏమిటో, ఏమిటా చప్పుడు? ఎందుకూ, చప్పుడు? అనవసరం. ఐనా ఆర్భాటం. అబ్బ, క్షణం అయినా, ఏకాంతంగా ప్రశాంతంగా బతకాలనుకోటం— కత్తిమీద సాములాగా ఉంది. తల్లీ, పిల్లి కూనా, నువ్వా, వచ్చింది? బాగుంది. మంచి శకునమే. ఊఁ."

ఏమిటిట్లా నేను మారిపోతున్నాను. పిల్లికూనను చూచినా చిరాకు పడుతున్నాను. ఇల్లు అయిన తరువాత పిల్లికూనలూ రాక బల్లులూ ఉండక

ఏమవుతుంది. అందరూ నాలాగా స్తబ్ధగా కొండంత విచారం గుండెల మీదెక్కి తొక్కుతూంటే ఏకాంతంగా, ప్రశాంతంగా వుంటారా? జీవశక్తి, చైతన్యం సాతత్య నృత్యకేళి జరుపుతూంటే!

నేనా, ఇది నా గీత, నా తలవ్రాత. ఏకాంతం, ప్రశాంతం నా నొసటన్ వ్రాసిన వ్రాత. తలిదండ్రులకు దూరంగా, తోబుట్టినవారికి వెలిగా, లంకంత మహాపట్నంలో— అల్లాడి ఆకులు మేస్తున్నాను. నిజంగా, నాబోటి దౌర్భాగ్యులు వుంటారా? ఏమో, ఎందరెందరున్నారో....

మహానాగరికత మణిప్రభలు చిమ్మే లంకలో అడుగుపెడితే చాలును కాని, మనోనువర్తులై మెలిగే సూర్యచంద్రుల నీడల్లో, లంకానగరంలో జీవించడమే చాలనుకుని, మహాశూరుడు, నీలమేఘ సుందరుడు, రావణ మహారాజు కన్నెత్తి చూస్తే చాలు, కనకాభిషేకం జరిగినట్లుగా— తలపోసి తలపోసి, నిద్రాహారాలు మాని, సిగ్గు విడిచి, తలిదండ్రులను ఒప్పించి, లంకేశ్వరుడికి భార్యనైనాను.

ఏమదృష్టం అమ్మాయిది అనుకున్నారు అమ్మా, నాన్నా. ఏమదృష్టం అనుకున్నారు చెలులు, నెచ్చెలులు. ఏమదృష్టం అనుకున్నాను, నేను గూడా.

అంతే.

ఆ అదృష్టదేవత, పెదిమ విరిచి, క్రూరంగా చూచి, సాధించి, వేధిస్తోంది. చాలు. ఈ జన్మకు చాలు. మహాప్రభో. జన్మకు ఏకీ కోరుకో గూడదు. కోరుకున్నామా, వరం అంటూ ప్రసాదింపబడిందా, మన బతుకు అవరంతో గిజగిజలాడిపోవాలిసిందే. నేను కోరిన కోరికకు— గతి, ఇదుగో, కావలసినంత ప్రశాంతం, కావలసినంత ఏకాగ్రత. ఆ, చిట్టితల్లి, నువ్వు ఉన్నావా ఇక్కడ, నాకు తోడుగా. వీణా, వీణా, నా ఆనందానికి, నిన్ను నేను ఏడ్పించి ఉంటాను. శ్రుతి చేస్తున్నానని, నీకు, నీ ప్రాణా

లయిన తీగలను బిగ్రబిగించి బాధించాను. మనస్సు ఎటులాగితే అటుపోయి నిన్ను ఓ మూల వేశాను. నువ్వేమీ, నన్ను శపించలేదుగద!

నా వలచినకాంతుడు అత్యద్భుతమూర్తి, సందేహం లేదు. రమణీ రమణీయమూర్తి; ఏం లాభం. నా ఇంటికే రారు; ప్రాణపతి తన యింటికి రావడం, ఉండడం తనను లాలించడం కవ్వించడం, నవ్వించడం, మైమరపించడం— అయ్యో రాత, నాలాంటి నిర్భాగ్యురాలికి గూడానా....

వారు, నా యింటి చాయలకు గూడా రారు.

ఇది బాగానే వుంది.

నిరంతరం. నాకోసం కలవరించే వీణ అంటే నాకు అశ్రద్ధ. నేను కలవరించేవారికీ యిట్లాగే అశ్రద్ధ అయితే— వేరే అనుకోటం ఎందుకు ?

వీణా, నా తప్పు మన్నించు. గౌసెనబాసి, ఖడ్గమువలెన్ మధురోద్ధర నృత్యలీలలు చేయి. రా, నేనే వస్తున్నా.

వీణా, నీకూ విచారమేనా? విచారంగా పలుకుతున్నావు? ఇక నీవే నాకు సర్వస్వం. నా బ్రతుకును, నీ బ్రతుకులో అంతర్లీనం చేస్తాను.

ఎవరది. చూళిక? ఏం, వీణ తీశానో లేదో, విఘ్నదేవరవు ప్రత్యక్షం అయ్యావు.

ఇందుకూ నేను నోచుకోలేదా, మహారాజు వస్తున్నారా?....

ఆఁ.

నిజంగానా ?

రారే.

వారికి నా యింటి పొద్దైనా గిట్టదే.

రారు. అట్లా అంటేనైనా, నేను నవ్వుతానని, చూశిక అబద్ధాలాడు తూంది. వారేమిటి, ఈ నిర్భాగ్యురాలింటికి రావడమేమిటి? వృత్తది.

బరువుగా అడుగుల చప్పుడు వినబడుతోంది. వారేనేమో. నా మనో భ్రమ. గాలికి చెట్లు కదిలితే, చెట్ల ఆకులు గలగలలాడితే, గవాక్షన గాలి నిట్టూర్చితే నా ప్రాణనాధుడు, లంకేశ్వరుడు, మహాశూరుడు రావణప్రభువు, నాకోసం, నా యింటికి వస్తున్నారనుకోటం— ఈ భ్రమ, నాకు యింకా ఎంత కాలం వుంటుందో.... పోదు. పుర్రెతో పుట్టిన బుద్ధి పుటకతో వచ్చిన బుద్ధి పోదు. అడుగులు బరువుగా వినబడుతున్నయ్.

ఆ నీలాంజన గిరిసన్నిభుడు, నా గుండెలలో నడుస్తూన్నట్లున్నాడు. నిజంగానే వస్తున్నారా.

నిజంగానేనా.... నిజంగానా?

వచ్చారు. ఆఁ. వచ్చేశారు.

నాముఖం సిగ్గుతో ముడుచుకొనిపోయింది. తల ఎత్తి వారిని చూడనే లేకపోతున్నాను.

'ధాన్యమాలినీ....'

ఎన్నాళ్ళకు, ఎన్నేళ్ళకు విన్నాను. నాపేరు, నా ప్రాణకాంతులు నోరారా పిలుస్తూంటే వినాలని, ఎంతకాలానికి తీరింది యీ చిన్న కోరిక!

'ధాన్యమాలినీ....'

తల ఎత్తి చూడవు. కడకంట కాంతులు తేజరిల్లవు. ప్రేమతో, ఉత్కంఠతో, చెక్కిళ్ళు జాలువారవు. నామీద కోపమేనా ఇదంతా...." అన్నారు వారు.

మళ్ళీ మళ్ళీ వినాలనిపించే మాటలు, వింటున్నాను.

నాకు తెలీకుండానే ఓరకంట చూచాను.

లంకేశ్వరులు, కళ్ళల్లో నవ్వుదాచుకుంటున్నారు.

'ధాన్యమాలినీ....'

తల ఎత్తి చూచాను.

"నా తప్పులు క్షమించు. అనేక రాచకార్యాలలో మునిగి, నీ దగ్గరికి రాలేకపోయాను."

దొంగమాటలు.

"ధాన్యమాలినీ, నీతో సావకాశంగా మాట్లాడాలి. యివాళ శివపూజ ఇక్కడే" అన్నారు రావణమహారాజు.

నిజంగానే లంకేశ్వరులు నిజంగా నాయింట, నా పంక్తిన సరసాలాడుతూ భుజిస్తారా? నాయింట సేదతీర్చుకుంటారా? నిజంగా? నామాటకేం, వారి మాటలకు, చూళిక ఉబ్బి తబ్బిబ్బులౌతూంటే! వారి పెదిమలు చలిస్తున్నయ్. ఏదో మాట్లాడబోయి ఆగినట్లున్నారు.

చూళికకేసి చుఱుకునేట్లు చూచాను. చూళిక ఏదో పని ఉన్నట్లు వెళ్ళింది

'ధాన్యా....' అన్నారు వారు. దశకంఠులు వారుమరి. ఏ దశకు తగ్గ కంఠం ఆ దశకు వారికి సహజంగా వస్తుందాయె.

'దా, యిప్పుడే తిరిగివద్దాం.'

ఎక్కడికీ, ఎందుకూ? అని అడగడం అపశకునం. అపశకునం మాటలు ఎందుకూ అని నేనూరుకున్నాను.

గొంతుకను నొక్కుకున్నాను కాని, నా కళ్ళు నాకు తెలీకుండానే అడిగినట్లున్నాయి.

"రా, అలాగ, అశోకవనందాకా వెళ్ళి కాస్త సీతతో మాట్లాడివద్దాము. నీవూ సాయం చేద్దుగాని."

ఇదా, ఎత్తు? సీతకోసం పడే జాలిలో నేనో పాచికనా....

"అలాగే సాయంత్రం వెళదాంలెండి" అన్నాను.

వారు, వింటేనా.... ఎదటివారు చెప్పే హితవు వింటం అంటూ వుంటే వారు ఇట్లా గెందుకవుతారు?

'లే మరీ.'

ఆజ్ఞాపిస్తున్నారు.

నా మనస్సు పట్టపగ్గాలు లేవు. అణచుకొన్న ఆక్రోశం పైకి వచ్చేస్తోంది, నిబ్బరించుకుంటున్నాను. అయినా ఆగలేదు.

"ఆ సీత మీకు ఎక్కడ దొరికిందండీ? ఏడుపుగొట్టు ముఖమూ అదీని. వన్నెచిన్నెలు లేవు, వయోవైభవం లేదు. చివరికి తనూ సౌష్ఠవం అయినా లేదు. ఎవర్తో, దారినపోయే పెద్దమ్మారు, లంకకువచ్చి పీఠం పెట్టుకుంది...." అన్నాను.

వారు, లంకేశ్వరులు, మహాశూరులు, చిత్రంగా నవ్వుతున్నారు. కోపం రాలేదు. అంతవరకు అదృష్టమే.

"మనుష్యులు నాకు గడ్డిపరకలు అని, బ్రహ్మదేవుడి దగ్గిరకూడా అన్నవారు మీరు. మీరు ఏమిటి, వచ్చి వచ్చి ఓ మానుషాంగనకు లొంగిపోవడం ఏమిటి?...." అని అన్నాను.

వారేమీ మాట్లాడలేదు.

సీతట, సీత. దాపరించింది, మా ప్రాణాలకు. ఎప్పుడు విరగడౌతుందో, ఎట్లా విరగడౌతుందోకాని—

వారి నేత్రాలు హోమగుండాలల్లే అయినై. చిన్న పర్వతం అంతవారు, చివాల్న లేచారు. మరోచూపు అంటూ లేకుండా, చివ్వున వెళ్ళారు.

వీధి చివరదాకా వచ్చి చూచాను. బరువుగా అడుగులు వేసుకుంటూ వెళుతున్నారు.

హుం. ఏ పిచ్చిలో పడితే ఆ పిచ్చేగాని, వెనుకచూపు లేదుగదా!

వారిని అంటున్నాను, నా తెలివి ఏమి తెల్లారింది?

ఇంటికి వచ్చిన నాథుని, రాక రాక ఇంటికి వచ్చిన వారిని, శివపూజ యిక్కడే అని, వావిడిచి చెప్పినవారిని, మాటలని పంపాను. హుం.

హుం. ఇంతే, నా జన్మ.

కాని మాటలు అంటున్నారని, కాని పనులకు పురిగొల్పుతున్నారని, గాండ్రుతున్నానేగాని, అలాగే అలాగే అంటూ ఆలస్యం చేయనేలేదు గదా. భుజించి, హాయిగా, ఆకుమడుపులందుకునేవేళ, సన్నసన్నగా చెప్పి చూడకపోతినిగదా, ఆమాత్రం తెలివి నాకేదీ? శనిదేవతకు విడిదిని నేను. దురదృష్టాలకు విహారవనాన్ని నేను.

ఎంతకాలం విచారపడినా లాభం లేదు. ఇంటికి వచ్చిన అతిథిని అవమానించిన రాక్షసిని నేను. నా పాపానికి ప్రాయశ్చిత్తం వుందా? కాళ్ళు ఆడడం లేదు. మనస్సు మనస్సులో లేదు. నిప్పులమీద నుంచున్నట్లుంది. నా యిల్లు నన్నే వెక్కిరిస్తూంది........ ఎక్కడికి పోతున్నాను,

నేను.... ఇదేమిటి, యీ దారిన పడ్డాను. ఛీ, సిగ్గూ ఎగ్గూ లేకుండా అశోక వనానికి పోతున్నానా.... ఏం వెళితే... నా ప్రాణపతివున్న చోటికి వెళ్ళడం తప్పా?.... బాగానే వుంది, నా అభిసారికతనం. (నవ్వి) అయ్యో రాత. అభిసారికను గూడాను. శుక్లాభిసారికనా? కృష్ణాభిసారికనా....? దివసాభిసారికనా? అశోకవనం.... అదేమిటి, అంతమంది చేరారు. ఏమన్నా ప్రమాదం సంభవించిందా.... నిద్రాహారాలు మాని, ఏడ్చి ఏడ్చి, ఆ సీత యిక్కడ ప్రాణం వొదిలిందా....? యిదో పాతకంగూడాను. లేదు. అదుగో, ఓ గడ్డిపరక చేతపుచ్చుకుని ఏదో వాగుతోంది. ఎందుకా గడ్డిపరక. మనుష్యులు నాకు తృణప్రాయం అన్నవారిని, లంకేశ్వరులను, మనుష్యాంగన, తృణప్రాయంగా చూచి మాట్లాడుతున్నట్లుంది. ఎంత పొగరు. గుంపు అర్ధచంద్రరేఖగా వుంది. తనచోట, తన రాజ్యంలో, తనవారి ముందు, లంకేశ్వరులు తిట్లు తింటున్నారా....? ఎంత దుర్గతి పట్టింది వారికి! గుంపులో కలిశాను.

"నీ నేత్రాలు, కృష్ణపింగళాలు, క్రూరాలూ. ఆ రెండు కళ్ళూ, ఎప్పుడు నేలమీద పడతాయో అప్పుడు, నీవు నీ ఐశ్వర్యం, నేలపాలై ...." ఆ సీత, వదరుతోంది. వినరాని మాటలు, విషం మాటలు. వాగుతోంది సీత. ఒక్క దెబ్బకు నరికిపారేస్తే తీరిపోతుంది పీడ. అబ్బ, దానిమాట, కర్ణశూలం.

పాపం. మండిన ఆ గుండెలోంచి అంతకంటె ఏం మంచిమాటలు వస్తాయ్. బలవంతాన తెచ్చి, బంధించి, ప్రాణం తీస్తుంటే, ఎవరైనా అంతే అంటారు. సీత తప్పులేదు. తప్పంతా మాదే. త్రిలోకసుందరి, మండోదరి మొదట్లోనే వారి ఆ పాడుబుద్ధిని చిదిమి వెయ్యాలిసింది. ఆ మహాయిల్లాలు పట్టించుకోలేదు. పాపం యిట్లా బద్దలౌతోంది. సీత యింకా ఏమో అంటోంది ఆగలేక పోయాను. అడ్డం వెళ్ళాను.

"ఏమిటి యీ ఆగడం, చాల్చాలు...." అన్నాను. అందరూ తెల్ల బోయారు.

"ఇందుకా పరిగెత్తుకుని వచ్చిందీ...." అని వారి సరస చేరాను. తల వొంచుకున్నారు వారు.

వారి రెక్క పుచ్చుకున్నాను, తల ఎత్తలేదు వారు. రండి....అన్నాను. మాట్లాడకుండా వస్తున్నారు. కాలదేవరకు ఏదో నామీద కరుణ కలిగినట్లుంది. లంకేశ్వరులు, మహాశూర్కులు త్రిలోకాలను గడగడలాడించినవారు, రావణ బ్రహ్మ, మారుమాట లేకుండా వస్తున్నారు. మౌనంగా నడుస్తున్నాను. మానావమానాలకు, ఆశానిరాశలకు, సమస్తానికీ సాక్షి ఐన సూర్యుడు, మబ్బుల చాటునుంచి మాకేసే చూస్తున్నాడు. మా యింటికి వచ్చేశాము. అమ్మయ్య. అనుకుంటున్నాను. గుమ్మంలో అడుగుపెట్టానో లేదో—

'ధాన్యా....' అన్నారు వారు. తల ఎత్తి చూచాను. "నీ యింటికి యిప్పుడు రాను, రాలేను. అక్కడా యిక్కడా అవమానమే జరిగింది. మొదట్లోనే నా మాటను తృణీకరించావు. చాల్చాలు....అన్నారు." బతిమాలు తున్నా, వినకుండా వెళ్ళారు. వెళ్ళిపోయేరు.

హుం. ఇంతే నీ జీవితం అని శూన్యం అయిన మా గుమ్మం అన్న ట్లయింది. తిరిగి వచ్చావా? అని ద్వారబంధం పలకరించినట్లయింది. మగ వాళ్ళంతే. నీ మంచి ఏమయింది. మంచికిపోయావు గదూ, అనుభవించు.... అన్నట్లయింది వీణ. చూశికా.... అన్నానుట. విరుచుకుని నేలమీద పడ్డా నుట. నేలమీదబడితేనేం, నేలబడితేనేం— ఈ ధాన్యమాలిని జాతకం ఇంతే.